TGTEL/25/A4812


వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 36 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | మే 15, 2026

# సామాన్యుడిపై 'చమురు' భారం



- భగ్గుమన్న పెట్రో మంట!
- లీటరుకు రూ.3 చొప్పున పెంపు
- నేటి నుంచే అమల్లోకి పెరిగిన ధరలు
- సీఎన్‌జీ ధర కిలోకు రూ.2 పెంపు..
- వాహనదారుల విలవిల

2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సామాన్యుడిపై కేంద్రం మరోసారి ధరల భారాన్ని మోపింది. గత కొంతకాలంగా ఊరిస్తున్న ముప్పు కాస్తా నిజమైంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ. 3, డీజిల్‌పై రూ. 3 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. కేవలం పెట్రోలియం ఉత్పత్తులే కాకుండా, పర్యావరణ హిత ఇంధనం 'సీఎన్‌జీ' ధరను కూడా కిలోకు రూ. 2 చొప్పున పెంచి గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి.

## వచ్చే ఏడాది నుంచి 'నీట్' ఆన్‌లైన్..

- లీకేజీలకు అడ్డుకట్టే లక్ష్యం: ధర్మేంద్ర ప్రధాన్
- జూన్ 21న రీ-ఎగ్జామ్..
- విద్యార్థుల భవిష్యత్తుకే మా ప్రాధాన్యం



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్' పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ప్రకటించారు. పేపర్ లీకేజీలు, అక్రమాలను అరికట్టి, పరీక్షా విధానంలో పారదర్శకతను పెంచేందుకు ఈ మార్పు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మే 3న నిర్వహించిన నీట్ పరీక్షలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో, విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. దీనికి సంబంధించి మంత్రి మాట్లాడుతూ.. జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కేసు విచారణ: పేపర్ లీక్ ఆరోపణలపై ఇప్పటికే సీబీఐ విచారణ ప్రారంభించింది.

( మిగతాది 2వ పేజీలో..)

## ఆదివారం నుంచి అధిక జేష్టమాసం

- నెల రోజుల పాటు శుభకార్యాలకు బ్రేక్!
- జూన్ 20 తర్వాతే మళ్లీ పెళ్లిళ్ల సందడి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలుగు లోగిళ్లలో గత ఫిబ్రవరి నుంచి మే 13 వరకు సందడిగా సాగిన పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు తాత్కాలికంగా విరామం పడింది. ఆదివారం నుంచి 'అధిక జ్యేష్ఠ మాసం' ప్రారంభం కానుండటంతో వచ్చే నెల జూన్ 20 వరకు ఎలాంటి ముహూర్తాలు లేవని పురోహితులు స్పష్టం చేశారు. దీంతో పెళ్లిళ్లు, గృహప్రవేశాలపై ఆధారపడ్డ వివిధ రంగాల వారికి పనిలేకుండా పోయింది. పండితుల లెక్కల ప్రకారం, ఈ ఏడాది మిగిలిన నెలల్లో ముహూర్తాల జూన్ 21వ తేదీ నుంచి నెలాఖరు వరకు 8 రోజులు అనువైన ముహూర్తాలు ఉన్నాయి. జూలై లో కేవలం 4 రోజులు మాత్రమే అవకాశం ఉంది. ఆగస్టులో 11 రోజులు ముహూర్తాలు ఉన్నప్పటికీ, చతుర్మాసం కారణంగా కొన్ని ఆంక్షలు ఉంటాయి. సెప్టెంబరు, అక్టోబరులో నెలకు 4 రోజుల చొప్పున మాత్రమే ముహూర్తాలు ఉన్నాయి. నవంబరు, డిసెంబరులో కార్తీక మాసం ప్రభావంతో నవంబరులో 11 రోజులు, డిసెంబరులో 14 రోజులు పెళ్లిళ్లకు అనువైన రోజులు ఉన్నట్లు పండితులు వివరించారు. పసిడి, వెండి ధరలు భారీగా తగ్గిడంతో వినియోగదారులకు ఊరట కలిగినట్లయింది.

(మిగతా వివరాలు 2వ పేజీలో..)






2లో..

## ట్రంప్ పెట్టిన కుంపటితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం!

- ఇరాన్‌పై దాడులతో భారత్‌పై చమురు భారం..
- నింగికి నిత్యావసర ధరలు
- ఐటీ రంగంలో ఉద్యోగాల కోత
- ఆఫర్ లెటర్లను రద్దు చేస్తున్న కార్పొరేట్ దిగ్గజాలు
- ఇంధన పొదుపునకు 'వర్క్ ఫ్రమ్ హోమ్'

# విపక్షాలవి చిల్లర రాజకీయాలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- పెట్రో ధరల పెంపును సమర్థించిన కేంద్ర మంత్రి
- యుద్ధ వాతావరణం, దిగుమతి భారమే కారణం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తోన్న విమర్శలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ విపణిలో నెలకొన్న అనిశ్చితి, యుద్ధ మేఘాల కారణంగానే చమురు సంస్థలు ధరలు పెంచాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. (మిగతా వివరాలు 2వ పేజీలో..)



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, మే 15, 2026

## వచ్చే ఏడాది నుంచి 'నీట్' ఆన్‌లైన్..

- లీకేజీలకు అడ్డుకట్టే లక్ష్యం: ధర్మేంద్ర ప్రధాన్
- జూన్ 21న రీ-ఎగ్జామ్..
- విద్యార్థుల భవిష్యత్తుకే మా ప్రాధాన్యం

(**మొదటి పేజీ తర్వాత..**) దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. విద్యార్థులు తమకు నచ్చిన నగరాన్ని పరీక్షా కేంద్రంగా ఎంచుకోవడానికి వారం రోజుల గడువు ఇచ్చారు. రీ-టెస్ట్ రాసే విద్యార్థులు ఎలాంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. జూన్ 14వ తేదీ నుంచి అడ్మిట్ కార్డులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. "ఏటా దాదాపు కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాం. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు. పారదర్శకమైన విచారణ ద్వారా వాస్తవాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయి" అని ధర్మేంద్ర ప్రధాన్ భరోసా ఇచ్చారు. ఈసారి పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## ఆదివారం నుంచి అధిక జేష్ఠమాసం

- నెల రోజుల పాటు శుభకార్యాలకు బ్రేక్!
- జూన్ 20 తర్వాతే మళ్లీ పెళ్లిళ్ల సందడి

(**మొదటి పేజీ తర్వాత..**) హైదరాబాద్‌లో రూ.2,240 తగ్గిన బంగారం.. వెండిపై రూ.10 వేల కోత దేశీయంగా శుభకార్యాల సీజన్ ముగియడం, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, కేంద్రం తీసుకున్న కొన్ని నిర్ణయాల ప్రభావంతో బంగారం ధరలు ఒక్కసారిగా దిగివచ్చాయి. గత కొద్ది రోజులుగా ఆకాశాన్ని తాకుతున్న పసిడి ర్యాలీకి బ్రేక్ పడింది. హైదరాబాద్ మార్కెట్ లో 24 క్యారెట్ల బంగారం రూ. 1,60,090గా ఉండి రూ. 2,240 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం రూ. 1,46,750 రూ. 2,050 తగ్గింది. కిలో వెండి రూ. 3,05,000 రూ. 10,000 తగ్గింది. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,60,240 వద్ద ఉండగా, చెన్నైలో అత్యధికంగా రూ.1,63,390 వద్ద కొనసాగుతోంది. ముంబైలో హైదరాబాద్ తరహాలోనే రూ.1,60,090 వద్ద ట్రేడవుతోంది. దేశవ్యాప్తంగా వెండి ధర కూడా కిలోకు రూ.10 వేలు తగ్గడంగమనార్హం. అధిక మాసం కారణంగా పెళ్లిళ్ల సందడి తగ్గడం కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# సామాన్యుడిపై 'చమురు' భారం

- భగ్గుమన్న పెట్రో మంట!
- లీటరుకు రూ.3 చొప్పున పెంపు
- నేటి నుంచే అమల్లోకి పెరిగిన ధరలు
- సీఎన్‌జీ ధర కిలోకు రూ.2 పెంపు..
- వాహనదారుల విలవిల




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సామాన్యుడిపై కేంద్రం మరోసారి ధరల భారాన్ని మోపింది. గత కొంతకాలంగా ఊరిస్తున్న ముప్పు కాస్తా నిజమైంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ. 3, డీజిల్‌పై రూ. 3 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. కేవలం పెట్రోలియం ఉత్పత్తులే కాకుండా, పర్యావరణ హిత ఇంధనం 'సీఎన్‌జీ' ధరను కూడా కిలోకు రూ. 2 చొప్పున పెంచి గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి.



### బాదుడు మొదలైంది!..

లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి నెలలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించిన చమురు సంస్థలు, ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే మళ్లీ బాదుడు మొదలుపెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని, ధరలు పెరగవని కేంద్రం ఇటీవల పలుమార్లు హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఆ మాటలు నీటి మూటలయ్యాయి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరగడం, చమురు కంపెనీలపై ఆర్థిక ఒత్తిడి పెరగడమే ఈ పెంపునకు ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

### రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ పెంపు

తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున పెరగగా, ఆంధ్రప్రదేశ్‌లో వ్యాట్ ప్రభావంతో పెట్రోల్‌పై రూ. 3.29, డీజిల్‌పై రూ. 3.14 చొప్పున అదనపు భారం పడింది. ప్రధాన నగరాల్లో సవరించిన ధరలు (లీటరుకు) హైదరాబాద్ పెట్రోల్ రూ.111.00 (సుమారు), డీజిల్ రూ. 99.00, ఢిల్లీ 97.77, 90.67, ముంబయి 106.68, 93.14, కోల్‌కతా 108.74, 95.13, చెన్నై 103.67, 95.25గా ఉన్నాయి.

### నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ఛాన్స్..

ధరలు భారీగా పెరుగుతాయనే సంకేతాలతో గురువారం రాత్రి నుంచే పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. ఒక్కసారిగా రద్దీ పెరగడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. డిమాండ్‌కు సరిపడా నిల్వలు లేక కొన్ని పెట్రోల్ బంకుల యజమానులు 'నో స్టాక్' బోర్డులు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డీజిల్ ధర పెరగడం వల్ల రవాణా ఖర్చులు భారీగా పెరగనున్నాయి. ఫలితంగా కూరగాయలు, పప్పు ధాన్యాలు, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి 'పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు' తయారైందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# విపక్షాలవి చిల్లర రాజకీయాలు

(**మొదటి పేజీ తర్వాత..**) ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు చమురు ధరలపై ప్రభావం చూపుతున్నాయని మంత్రి వివరించారు. అమెరికా వంటి దేశాల్లో నెలకొన్న ఆర్థిక పరిస్థితులు, ఇతర దేశాల మధ్య యుద్ధ వాతావరణం వల్ల క్రూడాయిల్ ధరలు పెరిగాయి. చమురు దిగుమతుల కోసం భారత్ భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని, ఆ భారాన్ని తగ్గించుకోవడానికి ధరల సర్దుబాటు అనివార్యమని పేర్కొన్నారు. ధరల పెంపును సాకుగా తీసుకుని కాంగ్రెస్, ఇతర పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని కిషన్ రెడ్డి మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, చమురు సంస్థల మనుగడ కోసం కేంద్రం ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని మంత్రి సమర్థించుకున్నారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా ధరలు తగ్గితే, ఆ ప్రయోజనాన్ని ప్రజలకు తప్పకుండా చేరవేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## 4వ బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ రమణా రెడ్డి

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మామునూరులోని 4వ బెటాలియన్ (టీజీఎస్పీ) ను బెటాలియన్ డీఐజీ వి.వి.రమణా రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించిన డీఐజీ, బెటాలియన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డీఐజీ తన పర్యటనలో భాగంగా మోటార్ ట్రాన్స్‌పోర్ట్, బెటాలియన్ వెల్ఫేర్, హెడ్ క్వార్టర్స్, యూనిట్ హాస్పిటల్, పెట్రోల్ బంక్ మరియు క్వార్టర్ మాస్టర్ కార్యాలయాలను సందర్శించారు. వీటి నిర్వహణ సక్రమంగా, క్రమశిక్షణతో కూడి ఉండని ఆయన



సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో ఉన్నతాధికారులు మరియు మినిస్టీరియల్ సిబ్బందితో సమావేశమై, కార్యనిర్వహణ తీరును అభినందించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కమాండెంట్లు మూర్తుజా రెహమాన్, బాలయ్య, రాజేందర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రంప్ పెట్టిన కుంపటితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం!

- ఇరాన్‌పై దాడులతో భారత్‌పై చమురు భారం..
- నింగికి నిత్యావసర ధరలు
- ఐటీ రంగంలో ఉద్యోగాల కోత
- ఆఫర్ లెటర్లను రద్దు చేస్తున్న కార్పొరేట్ దిగ్గజాలు
- ఇంధన పొదుపునకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఏకైక మార్గం?

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలు ప్రపంచ దేశాలను పెను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇరాన్‌పై దాడుల హెచ్చరికలు, అంతర్జాతీయ వాణిజ్య ఆంక్షల వల్ల ముడి చమురు సరఫరా నిలిచిపోయి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీని ప్రభావం భారత్ వంటి వర్ధమాన దేశాలపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా రంగం కుదేలై, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. ఆర్థిక మాంద్యం భయాలతో అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఉద్యోగాల కోతకు తెరలేపాయి. గత నెలలో 30 వేల మందిని తొలగించిన ఒరాకిల్ సంస్థ, తాజాగా నిట్ వరంగల్, ఐఐటీ హైదరాబాద్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఇచ్చిన జాబ్ ఆఫర్లను, ప్రీ-ప్లేస్‌మెంట్ ఆఫర్లను రద్దు చేసింది. అటు సిస్కో 4 వేల మందిని, లింక్డ్‌ఇన్ తన సిబ్బందిలో 5 శాతం మందిని తొలగించేందుకు సిద్ధమైంది. దీంతో ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడింది.

### 'వర్క్ ఫ్రమ్ హోమ్' మంత్రం..

దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఐటీ ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేయాలని సూచించారు. నగరంలో సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉండగా, వారిలో సగం మంది వారానికి మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా నెలకు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా, విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యి రూపాయి విలువ బలపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

### నిపుణుల హెచ్చరిక..

ప్రభుత్వాలు కేవలం పొదుపు మంత్రం జపించడమే కాకుండా, ప్రజాప్రతినిధుల దుబారాను అరికట్టాలని మేధావులు కోరుతున్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం అత్యవసరమని సూచిస్తున్నారు. ట్రంప్ సృష్టించిన ఈ అంతర్జాతీయ సంక్షోభం భారత్ ఆర్థిక వ్యవస్థను ఎంతటి ప్రమాదంలోకి నెడుతుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, మే 15, 2026

# చెంచుల జీవనోపాధి అభివృద్ధికి 'టీజీఐఎల్పీ' కీలకం

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- మల్లాపూర్ పెంటలో చెంచు కుటుంబాలతో ముఖాముఖి
- 34 కుటుంబాల సమస్యలపై ఆరా..
- స్వయం ఉపాధికి ప్రత్యేక ప్రణాళికలు
- అత్యంత పేదరికాన్ని పారద్రోలడమే ప్రభుత్వ లక్ష్యం



**నాగర్‌కర్నూల్, వాయిస్ వందే భారత్ :** అత్యంత వెనుకబడిన చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ ఇన్‌క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాం (టీజీఐఎల్ పీ)ను సమర్థవంతంగా అమలు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ అత్యంత పేదరికంలో ఉన్న 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, ప్రతి చెంచు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వారి ఆసక్తులకు అనుగుణంగా పశుపోషణ, కోళ్ల పెంపకం, అటవీ ఉత్పత్తుల ఆధారిత ఉపాధి మరియు చిన్న వ్యాపారాల్లో శిక్షణ ఇచ్చి ఆదాయ వనరులు పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చెంచు మహిళల ఆర్థిక సాధికారత కోసం మహిళా సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీలు కల్పించాలని కోరారు.



### 20వ తేదీలోగా పూర్తి నివేదిక కావాలి

మల్లాపూర్ పెంటలో తాగునీరు, విద్యుత్, రహదారులు మరియు ఆరోగ్య సేవల కొరతపై గ్రామస్థులు ఫిర్యాదు చేయగా, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లలు చదువుకు దూరం కాకుండా ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని స్పష్టం చేశారు. తాను మళ్లీ ఈ నెల 20వ తేదీన గ్రామాన్ని సందర్శిస్తానని, అప్పటికి వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలపై స్పష్టమైన ప్రణాళికతో ఉండాలని అధికారులను ఆదేశించారు.

### మానవీయ దృక్పథంతో పరిష్కారం

చెంచు కుటుంబాల సమస్యలను అధికారులు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని కలెక్టర్ కోరారు. పింఛన్లు, రేషన్, ఆరోగ్య భద్రత వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని, ఎవరూ మిగిలిపోకూడదని హెచ్చరించారు. ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడిపేలా చూడటమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ చిన్న ఓబులేష్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని ఐఎన్టీయూసీ అచ్చంపేట తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థత వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా మహబూబ్ అలీ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు ఎండనక, వాననక కష్టపడి తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని చదివిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు కూడా రేయింబవళ్లు శ్రమించి పరీక్షలకు సిద్ధమైతే, పేపర్ లీక్ కావడం వారిని తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. విద్యార్థుల కష్టాన్ని, తల్లిదండ్రుల ఆశలను కేంద్ర ప్రభుత్వం నీరుగార్చిందని ధ్వజమెత్తారు. నీట్ పేపర్ లీకేజీపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుంభకోణం వెనుక ఎంతటి వారున్నా వదలకుండా కనీసం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడేలా చట్టాలు చేయాలని కోరారు. అప్పుడే ఇలాంటి నేరాలు ఆగుతాయని అభిప్రాయపడ్డారు. దేశ విద్యార్థుల భవిష్యత్తును కాపాడలేని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, తన పదవికి తక్షణమే రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ పాషా, అచ్చంపేట మండల అధ్యక్షులు మౌలానా మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఉనికి కోసం బీజేపీ నేతల రాద్ధాంతం



- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- వంగూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే
- దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అచ్చంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు యాసంగి సీజన్ మొక్కజొన్న కొనుగోళ్లను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా, రైతులకు మద్దతు ధర లభించేలా ఐకేపీ, మార్క్ ఫెడ్ కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోళ్లు సాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ రవాణా, గన్నీ బ్యాగులు, హమాలీల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.

### ప్రతిపక్షాల తీరుపై ధ్వజం..

ఈ సీజన్‌లో మొక్కజొన్న దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం అన్ని సవాళ్లను అధిగమించి కొనుగోళ్లు చేస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. అయితే, కొందరు బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో, కేవలం తమ ఉనికిని చాటుకోవడం కోసమే కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి సమస్యలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. "ప్రజాస్వామ్యయుతంగా ఎక్కడైనా సమస్యలు ఉంటే నా దృష్టికి లేదా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలి. కానీ, అనవసరంగా రాద్ధాంతం చేస్తూ అడ్డంకులు సృష్టిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతుల ప్రయోజనాలను కాపాడతామని వంశీకృష్ణ స్పష్టం చేశారు. అధిక సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పుస్తక పఠనమే ఉన్నత శిఖరాలకు మార్గం

- ప్రిన్సిపల్ కె.గోపాల్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల అమ్రాబాద్‌లో ఘనంగా పుస్తక ప్రదర్శన
- ప్రజా పాలన - విద్యా వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమం
- డిగ్రీ ప్రవేశాలపై అధ్యాపక బృందం విస్తృత ప్రచారం



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. వారోత్సవాల్లో ఐదవ రోజైన శుక్రవారం నాడు కళాశాల లైబ్రరీ ఇన్‌చార్జ్ ఏ.చంద్రయ్య ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్ కె. గోపాల్ అధ్యక్షతన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. గోపాల్ మాట్లాడుతూ.. పుస్తకం మన జీవన విధానాన్ని మార్చే అత్యుత్తమ సాధనమని కొనియాడారు. "పుస్తకాన్ని తలవంచి చదవడం నేర్చుకుంటే, అది మనల్ని సమాజంలో తలెత్తుకుని జీవించేలా చేస్తుంది" అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రదర్శనలో భాగంగా వివిధ విజ్ఞాన, సాహిత్య మరియు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. పుస్తక ప్రదర్శన అనంతరం కళాశాల అధ్యాపక బృందం అమ్రాబాద్ మండల కేంద్రంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. 'దోస్త్' ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె. రాధ, ఏ. చంద్రయ్య, జి. ఆంజనేయులు, ఎం. శ్రీకాంత్, బి. రమేష్, వి. శివకుమార్, ఇతర అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## అచ్చంపేటలో అగ్నిప్రమాదం

**కాలి బూడిదైన జొన్న రొట్టెల హోటల్**



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మున్సిపాలిటీ పరిధిలోని సాయి నగర్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. హైదరాబాద్ రోడ్డు పక్కన పార్వతమ్మ అనే మహిళ నిర్వహిస్తున్న జొన్న రొట్టెల హోటల్ ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై పూర్తిగా కాలి బూడిదైంది. హోటల్ యజమాని పార్వతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గడిచిన ఐదేళ్లుగా ఆమె జొన్న రొట్టెలు చేస్తూ వచ్చిన ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి హోటల్ మూసివేసి ఇంటికి వెళ్లిన సమయంలో, అర్ధరాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగి హోటల్ మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు ఒక లక్షా యాభై వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని, తన జీవనాధారం కోల్పోవడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని పార్వతమ్మను పరామర్శించారు. కష్టపడి బతుకుతున్న పేద మహిళకు ఇంతటి నష్టం వాటిల్లడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మరియు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

## చమురు ధరల పెంపు సామాన్యుడిపై మోయలేని భారం

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, సీ.ఎన్.జి ధరలను భారీగా పెంచి సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మోయలేని భారాన్ని మోపిందని బీకేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన చమురు ధరల పెరుగుదలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో దేశంలో చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ధరలు పెంచే ప్రసక్తే లేదని ప్రధాని హామీ ఇచ్చారని వెంకట్రాములు గుర్తు చేశారు. కానీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వాలు ఏర్పడగానే, ఈరోజు నుండే ధరలను పెంచడం ప్రజలను వంచించడమేనని మండిపడ్డారు. ఇది "ఓడ దాటేదాకా ఓడ మల్లన్న.. ఓడ దాటాక బోడి మల్లన్న" అన్న చందంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజలు తగిన సమయంలో ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## పక్కా ప్రణాళికతో చదివితేనే లక్ష్య సాధన సులభం

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం
- అభ్యర్థులు రెసిడెన్షియల్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- ఖాళీ సీట్ల భర్తీకి అభ్యర్థులు సంప్రదించాలని సూచన



**సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు పక్కా ప్రణాళికతో చదివినప్పుడే విజయం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యా శాఖ వారోత్సవాలను పురస్కరించుకుని, ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఐదు నెలల ఉచిత శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తొలుత స్టడీ సర్కిల్ ఆవరణలో మొక్క నాటి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అభ్యర్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ స్టడీ సర్కిల్ అందిస్తున్న ఐదు నెలల ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి అభ్యర్థి ఒక్కో సబ్జెక్టుకు పక్కా ప్రణాళికతో షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలని, ఎక్కువ గంటలు చదవడంతో పాటు నిరంతరం రివిజన్ చేయడం ముఖ్యమని సూచించారు. దేశ, విదేశీ మరియు రాష్ట్ర స్థాయి పరిణామాలపై అవగాహన పెంచుకోవడానికి ప్రతిరోజూ దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులందరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

- **ఖాళీ సీట్ల భర్తీకి అవకాశం..**

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఇంకా ఖాళీగా ఉన్న సీట్లను ప్రభుత్వ నిబంధనల మేరకు భర్తీ చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు సిరిసిల్లలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధికారులను సంప్రదించి అడ్మిషన్ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులందరూ వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి, స్టడీ సర్కిల్ గౌరవ డైరెక్టర్ మల్లేశం, అభ్యర్థులు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న టీజీఎస్ సీపీసీఆర్ చైర్‌పర్సన్, సభ్యులు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్‌పర్సన్‌తో పాటు కమిషన్ సభ్యులు మర్రిపల్లి చందన, వందన గౌడ్, బండి అపర్ణ, వచన్ కుమార్ రెడ్డి, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్ కూడా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కమిషన్ బృందానికి ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వస్తి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి మండపంలో పండితులు వీరికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర్ శర్మ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులకు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ జి.అశోక్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, వి.వెంకట ప్రసాద్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

## అమరచింతలో ఎస్బీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలి

- డీఎంకు లక్ష్మీకాంత్ రెడ్డి వినతి
- మండల కేంద్రంలో పెరిగిన ఖాతాదారుల రద్దీ
- యూనియన్ బ్యాంకుపై పడుతున్న అదనపు భారం
- సానుకూలంగా స్పందించిన ఎస్బీఐ రీజినల్ మేనేజర్



**అమరచింత, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలో తక్షణమే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని జోగులాంబ రీజినల్ కార్యాలయంలో ఆయన ఎస్బీఐ డివిజినల్ మేనేజర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం అమరచింత మండల కేంద్రంలో కేవలం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. ఆ బ్యాంకులో సుమారు 50 వేల ఖాతాలు ఉండటం వల్ల అటు అధికారులు, ఇటు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మండలంలోని 14 గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు పొరుగు మండలాల ఖాతాదారులు కూడా ఇక్కడికే రావడం వల్ల రద్దీ పెరిగిపోతోందని, అదనంగా మరో బ్యాంకు అవసరం ఎంతైనా ఉందని ఆయన డిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో ఎస్బీఐ డీజీఎంని కలిసి వినతి పత్రం అందించిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. దీనిపై రీజినల్ కార్యాలయ డీఎం సానుకూలంగా స్పందిస్తూ.. ఇప్పటికే అమరచింతలో బ్యాంక్ ఏర్పాటుకు సంబంధించి క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేశామని వెల్లడించారు. సర్వే నివేదికను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి పంపించామని, నివేదిక ఆధారంగా వీలైనంత త్వరలోనే అమరచింత వాసులకు శుభవార్త తెలియజేస్తామని హామీ ఇచ్చినట్లు లక్ష్మీకాంత్ రెడ్డి మీడియాకు తెలిపారు.

## ఘనంగా శత సహస్ర మహా లింగాష్టక పారాయణం

**హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీ రాజరాజేశ్వర ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం వారి ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శత సహస్ర మహా లింగాష్టక పారాయణం, లక్ష మోదుక సహిత శ్రీ మహాగణపతి హోమం కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ప్రభుత్వ విప్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుతూ ఇటువంటి గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భక్తి భావంతో జరిపే పారాయణాలు, హోమాలు సమాజానికి శాంతిని చేకూరుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రం ప్రతినిధులు ఈ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని లింగాష్టక పారాయణం చేశారు. హోమగుండం వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య లక్ష మోదుక సమర్పణ కార్యక్రమం నయనానందకరంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.